క్లుప్తంగా

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

కాకినాడ: జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో సెలవు రోజైన గురువారం కూడా విద్యుత్ బిల్లులను స్వీకరిస్తామని ఏపీ, ఈపీ డీసీ ఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఏపీ, ఈపీ డీసీ ఎల్ సెక్షన్ ఆఫీస్, కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో కూడా గురువారంతో పాటు ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చునన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: కాకినాడ పవర్‌హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రామారావుపేట, మూడు లైట్ల జంక్షన్, వెటర్నరీ హాస్పటల్ రోడ్డు, శేషసాయివీధి, సాంబమూర్తివీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ఐక్యతే కార్మికుల బలం

రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు వీరభద్రారెడ్డి



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి

కాకినాడ: ఐక్యతే కార్మికుల బలమని రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీ డీప్ వాటర్ పోర్టు యూనియన్ సభ్యుడు కరుకు దుర్గారావు కుటుంబానికి అసోసియేషన్ ద్వారా బుధవారం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. దుర్గారావు ఇటీవల గుండెపోటుతో మరణించగా ఆయన భార్యకు ఈ సహాయం అందించారు. లక్ష్మీ డీప్‌వాటర్ పోర్టు అధ్యక్షుడు పట్టా ధనలక్ష్మి, కార్యదర్శి బలసాడి వీరబాబు, ఉపాధ్యక్షుడు మల్లాడి వెంకటేష్, కోశాధికారి పినపోతు దుర్గారావు, నాగిడి విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: బైక్ చోరీ కేసులో వ్యక్తికి 7 నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ స్పెషల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎ.నాగమల్లేశ్వరి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఆకివీడు మండలం చిన కాపవరానికి చెందిన కుప్పల ఏసు అలియాస్ రమేష్ 2022లో నడకుదురు గ్రామంలో హోటల్ వద్ద ఉన్న బైక్‌ను చోరీ చేశారు. దీంతో కరప పోలీసులకు బైక్ యజమాని వీరభద్రరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో రమేష్ నేరం అంగీకరించడంతో 7 నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కొరిపల్లిలో రూ.లక్ష చోరీ

కరప: బంధువుల ఇంటికి పరామర్శకు వెళితే, అల్మారాలో ఉంచిన రూ.లక్ష ఒక దొంగ ఎత్తుకెళ్లిపోయిన ఘటన బుధవారం మండలం కొరిపల్లి జరిగింది. ఎస్ఐ నౌడు రామకృష్ణ తెలిపిన కథనం మేరకు.. కొరిపల్లికి చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి కుక్కలూరి నాగేశ్వరరావు అత్త పెదపూడి మండలం అచ్యుతాపురత్రయం గ్రామంలో ఈ నెల 23న మృతి చెందింది. అప్పటి నుంచి ప్రతి రోజూ నాగేశ్వరరావు తన భార్యతో కలసి అచ్యుతాపుర త్రయానికి ఉదయం వెళ్లి సాయంత్రానికి తిరిగి కొరిపల్లికి వచ్చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కూడా వారు అచ్యుతాపురత్రయం వెళ్లారు. కొంతసేపటికి ఎవరో గుర్తుతెలియని వ్యక్తి నాగేశ్వరరావు ఇంట్లో ఉండటాన్ని గమనించి పొరుగున ఉన్న ఎర్రంనీడి రాణి ఫోన్‌చేసి సమాచారం అందించింది. దొంగతనం గురించి సమాచారం తెలిసిన వెంటనే నాగేశ్వరరావు తన మావయ్యతో కలసి ఇంటికివచ్చారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి తప్పుడు తాళంచెవితో ఇంటిలోకి చొరబడి, అల్మారాలో చీరల మాటున ఉంచిన ద్వాక్రా సొమ్ము రూ.లక్ష దోచుకుని పరారైనట్టు గమనించారు. ఈ మేరకు కరప పోలీసుస్టేషన్‌లో బాధితుడు జరిగిన దొంగతనంపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కరప: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల యూనియన్ తలపెట్టిన జీపుజాతా బుధవారం కరప చేరుకుంది. కరపలోని భవననిర్మాణ కార్మికుల సంఘ, సీఐటీయూ భవనం వద్ద పలువురు నాయకులు మాట్లాడారు. వచ్చేనెల 9, 10 తేదీల్లో కలెక్టరేట్ వద్ద నిర్వహించే 36 గంటల నిరసనకు అంగన్‌వాడీలు, సీఐటీయూ అనుబంధ సంస్థలు తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, జిల్లా గౌరవాధ్యక్షురాలు జి.బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు తొలి ఏకాదశి పూజలు

కరప: స్థానిక విష్ణాలయంలో గురువారం తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు తెలిపారు. ఆషాఢ శుద్ధ ఏకాదశినే తొలి ఏకాదశి అంటారని, ఈ రోజు విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనదని వారు తెలిపారు. ఆలయంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ వడ్డాది సత్తిబాబు తెలిపారు. యండమూరులోని పురాతన వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తామని ప్రధాన అర్చకుడు సీతారామం తెలిపారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వలంటీర్లు



సేవావజ్ర పురస్కారాన్ని అందుకున్న వలంటీర్ నాగబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురసాల , ఎంపీ గీత

- ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు
- వలంటీర్లకు సేవా పురస్కారాలు

కాకినాడ రూరల్: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధుల్లా వలంటీర్లు పనిచేస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నగరంలోని రూరల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లు 1, 2, 3, 42, 47, 48, 49, 50లలో విశేష సేవలు అందించిన వలంటీర్లను విద్యుత్‌నగర్ చల్లా కల్యాణమండపంలో బుధవారం సాయంత్రం సన్మానించారు. నగరపాలకసంస్థ టీపీఆర్వో మానే కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 293 మంది వలంటీర్లకు సేవామిత్ర, సేవరత్న, సేవావజ్ర పురస్కారాలతో సన్మానించి, పత్రాలు, నగదు పురస్కారాలను ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కన్నబాబు అందజేశారు. కన్నబాబు మాట్లాడుతూ వలంటీర్లు చాలా చురుగ్గా పనిచేస్తున్నారని, వారిని చులకనగా చూసినవారే ఇప్పుడు తలదించుకునే పరిస్థితులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రతినిధులుగా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను అందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. సిటీలో 1900 మంది, రూరల్ నియోజకవర్గ పరిధిలో 316 మంది పనిచేస్తున్నారని, వీరిలో 90 శాతం మహిళలే కావడం విశేషమన్నారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నడక పేద ప్రజల జీవితాన్ని మార్చిందన్నారు. అనంతరం సేవా వజ్రగా ఎంపికైన స్వామినగర్‌కు చెందిన కర్రి నాగబాబుతో పాటు సేవా రత్న, మిత్రలను అభినందించారు. కార్పొరేషన్ కార్యదర్శి ఏసుబాబు, వలంటీర్లు, వారి సేవల గురించి తెలియజేశారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, వాసిరెడ్డి సూరిబాబు తదితరులు ప్రసంగించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను, సూరిబాబు, కడియాల చిన్న, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో పాల్గొనాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ వచ్చేనెల ఒకటి నుంచి ప్రారంభమవుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, అధికారులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. ప్రజలకు కావలసిన సేవలను వారి ఇంటి వద్దే ఉచితంగా అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. వివిధ రకాల 11 సేవలకు సంబంధించి ఇప్పటికే సర్వే ప్రారంభమైందన్నారు.



సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి

రూ.8.1 కోట్లతో టిడ్కోలో విద్యుదీకరణ

- ఎంపీ, ఎమ్మెల్యేలు గీత, ద్వారంపూడి

కాకినాడ: స్థానిక టిడ్కో కాలనీలో రూ.8.1 కోట్లతో విద్యుదీకరణ పనులు చేపడుతున్నట్టు ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక పర్లోపేట సమీపంలోని టిడ్కో ఆవరణలో ప్రతిపాదించిన సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు వారు బుధవారం శంకుస్థాపన చేశారు. దాదాపు రెండు వేల డిట్కో ఇళ్ల సముదాయంలో మౌలిక వసతులను వేగవంతం చేశామన్నారు. త్వరలోనే ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. టిడ్కో కాలనీ ఆవరణలో భవిష్యత్‌లో లో వోల్టేజీ సమస్య రాకుండా రూ.4 కోట్లతో సబ్ స్టేషన్‌తో పాటు మరో రూ.4 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వారితో పాటు కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, విద్యుత్‌శాఖ డీఈ (ప్రాజెక్టు) డేవిడ్, ఆపరేషన్స్ డీఈ జి.ప్రసాద్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- త్రిచక్ర మోటారు సైకిళ్ల పంపిణీ



లబ్ధిదారుకు మూడు చక్రాల స్కూటర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ముంతాజ్

కాకినాడ రూరల్: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి అవసరమయ్యే సౌకర్యాలు కల్పనకు పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ ద్వారా నియోజవర్గంలో పది మందికి ఉచితంగా ప్రభుత్వం మంజూరు చేసిన మూడు చక్రాల మోటారు సైకిళ్లను రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నబాబు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ సహాయ చైర్మన్ ముంతాజ్ పఠాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ నియోజవర్గం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి తొలి విడతగా వీటిని పంపిణీ చేసినట్టు తెలిపారు. తూరంగికి చెందిన ఒక లబ్ధిదారు మృతి చెందారని, మిగిలిన 9మందికి అందజేశామన్నారు. ఒక్కో వాహనానికి రూ.92వేలు వరకు ఖర్చయినట్టు తెలిపారు. సంస్థ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులు లైసెన్స్ కలిగి, పదో తరగతి పాసైన వారిలో 18 నుంచి 45 ఏళ్లవారు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ సంస్థ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, లబ్ధిదారులు, ఏపీఎస్పీ జెడ్పీ హైస్కూల్ చైర్మన్ కడియాల రాజు, గంజా సత్తిబాబు, రేఖా రెడ్డి, గొల్లపల్లి జగన్, తోటకూర శ్రీను పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషిచేయండి

వైఎస్సార్ సీపీ పటిష్టతకు పనిచేయాలని పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా నియమితుడైన మోకా కృష్ణంరాజుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచించారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో కృష్ణంరాజు బుధవారం ఎమ్మెల్యేను కలసి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజులు కీలకమని ప్రజల వద్దకు వెళ్లి అధికార పార్టీ ద్వారా పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలని సూచించారు. కృష్ణంరాజును జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, గోపుశెట్టి బాబ్జీ తదితరులు అభినందించారు.

జగనన్న సురక్ష సర్వే పకడ్బందీగా చేయించాలి



సర్వేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరప: ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, గ్రామాల్లో వలంటీర్లతో ఇంటింట సర్వే నిర్వహించి, గుర్తించిన సమస్యలను సచివాలయాల్లో నమోదు చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ కార్యక్రమ లక్ష్యాలను వివరించి అనుసరించిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, వీపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, డీటీ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- గడప గడపలో ద్వారంపూడి

కాకినాడ: ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన 6వ డివిజన్ పరిధిలోని కోకిలా సెంటర్, వైఎస్సార్ వారధి, ఆర్టీసీ కాంప్లెక్స్, నూకాలమ్మ మాన్యం, బర్మాకాలనీ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సమర్థవంతమైన పథకాలను అమలుచేస్తున్న ముఖ్యమంత్రి ఇంకా ఎక్కడైనా సమస్యలు మిగిలి ఉంటే వాటిని స్వయంగా పరిశీలించి పరిష్కరించే లక్ష్యంతోనే గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజల సంక్షేమం కోసం సీఎం జగన్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

ఇటువంటి ముఖ్యమంత్రి మరోసారి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరింత సుఖ సంతోషాలతో జీవించగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మార్కెట్‌కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కొంతం శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బండి సత్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కన్నా కమీషన్లపైనే ధ్యాస

- అందుకే కొండబాబుకు ఓటమి
- జేసీఏ కన్వీనర్ సుంకర సాగర్



విలేకర్లతో మాట్లాడుతున్న సుంకర సాగర్

కాకినాడ: అధికారంలో ఉన్నంతసేపూ గెలిపించిన ప్రజల అభివృద్ధి, సంక్షేమం కన్నా అవినీతి, కమీషన్లపైనే టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దృష్టిపెట్టారని, అందువల్లే ప్రజలు ఆయనకు ఓటమిని బహుమానంగా ఇచ్చారని జగనన్న కన్వీనర్లు, గృహసారథుల కన్వీనర్ సుంకర విద్యాసాగర్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ప్రజలను పట్టించుకోని వనమాడిని వెనకేసుకొస్తున్న టీడీపీ నేతలు ఎమ్మెల్యే ద్వారంపూడిపై చేస్తున్న విమర్శలు అర్థ రహితమని అన్నారు. సొంత జగన్నాథపురం, ఏటిమొగ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేయలేకపోయారని, అదే ద్వారంపూడి తన హయాంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. ఎమ్మెల్యేకు ద్వారంపూడికి మద్దతుగా నిలిచామన్న అక్కసుతో తమ కుటుంబంపై కూడా వ్యక్తిగత విమర్శలు చేస్తున్న టీడీపీ మాజీ కార్పొరేటర్లు నోరు అదుపులో పెట్టుకోకపోతే తాను కూడా అదేస్థాయిలో స్పందించాల్సి వస్తుందన్నారు. మేయర్ ఎన్నికల సందర్భంగా టీడీపీ కార్పొరేటర్ల బేరసారాలు, అవినీతితో సహా అన్నింటి ఆధారాలతో బయటపెట్టగలమన్నారు. రాజకీయ భిక్షపెట్టిన ద్వారంపూడి వెంట ఉంటామని స్పష్టం చేశారు. గద్దేపల్లి దాసు, గోడివెంకట్, అజ్జు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరికి ఆషాఢం సారె

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామికి ఆషాఢ పౌర్ణమి సందర్భంగా జులై 3న ఆషాఢం సారె సమర్పించనున్నట్టు ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి బుధవారం విలేకర్లకు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలు నుంచి ఆలయ సమీపంలోని రామాలయం నుంచి ఆషాఢం సారె ఊరేగింపు జరుగుతుందన్నారు. మహిళా భక్తులు అమ్మవారికి సారె సమర్పించుకోవచ్చునన్నారు. అదే రోజు బాలాత్రిపుర సుందరి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

మానవత్వంతోనే నైతికతకు గుర్తింపు

కాకినాడ: మానవత్వం పతనం వైపు పయనించినప్పుడు నైతిక విలువలు కూడా దిగజారిపోతాయని జైన మత సాధ్వీలు ఆత్మదర్శన శ్రీజ, సంయాగ్ దర్శన సాధ్వి, చారుదర్శన సాధ్వి పేర్కొన్నారు. బుధవారం కాకినాడ చేరుకున్న ఆదితానా మతగురువులకు ఘనస్వాగతం లభించింది. ముగ్గురు సాధ్వీలు కాకినాడ చేరుకుని జైన్ మతస్తుల రాజేంద్ర భవన్‌లో బస చేశారు. అక్కడ ఐదు నెలల పాటు ప్రవచనాలు, ఉపవాస దీక్షలు చేయనున్నారు. ఇక్కడకు ర్యాలీగా చేరుకున్న వీరికి నగరంలోని జైన్ సమాజంతో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న ఘనస్వాగతం పలికారు. సాధ్వీలు మాట్లాడుతూ భగవాన్ మహావీరుడు, గౌతమ బుద్ధుడు, స్వామి వివేకానంద, మహాత్మగాంధీ, గురుదేవ్ తులసి, ఆచార్య మహాప్రజ్ఞ వంటి సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ స్థిరపడిన జైన్‌లు ఆధ్యాత్మిక తత్వాకు, సేవా తత్పరతకు నిదర్శనంగా, మారుపేరుగా నిలుస్తారన్నారు. సాధ్వీలు ఇచ్చే ప్రవచనాలు, సందేశాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి ప్రయోజనం కలిగేలా మరిన్ని సేవలు అందించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి నిర్మల్‌కుమార్ జైన్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, జైన్ సంఘ ప్రతినిధులు భవర్‌లాల్ జైన్, తిలోక్‌చంద్ జైన్, విక్రమ్, ప్రకాష్, మహేందర్, సంజయ్, సాముప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సోముప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ సందర్భంగా మహిళలకు దుస్తుల పంపిణీ

కాకినాడ రూరల్: బక్రీద్ పండగ సందర్భంగా అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ముస్లిం మహిళలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు. పండగ రోజున నూతన వస్త్రాలను అందించిన అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్‌ను ఆయన అభినందించారు. డాక్టరు సువర్ణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ చౌదరి, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్థిక అక్షరాస్యత' విజేతలకు అభినందనలు



విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డీఈవో అన్నపూర్ణ

కాకినాడ సిటీ: జీ–20 కార్యక్రమంలో భాగంగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అఖిల భారత స్థాయిలో బుధవారం స్థానిక రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్ (ఆనంద భారతి)లో జిల్లా స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలను నిర్వహించారు. కాకినాడ లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈనెల 21న జిల్లాలోని అని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బుధవారం జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో పెదపూడి మండలం జీఎంజీ హైస్కూల్ విద్యార్థులు కేవీఆర్ మనోహర్, జీకే తేజశర్మలు నిలిచారు. రెండో స్థానంలో రౌతులపూడి మండలం జెడ్పీపీ హైస్కూల్ విద్యార్థులు కె.యశ్వంత్, కె.గంగాధర్, మూడో స్థానంలో గొల్లప్రోలు మండలం జెడ్పీపీ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు యు.జీవన్ సిద్ధు, ఎ.సుమశ్రీ నిలిచారు. జిల్లాలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలచిన పెదపూడి మండలం విద్యార్థులు జూలై 14న విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు జిల్లా స్థాయి విజేతలకు డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్‌లు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు.

ప్రతి విద్యార్థీ ఉత్తమ పౌరుడిగా ఎదగాలి

బాలాజీచెరువు: ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగాలని మండల విద్యాశాఖాధికారి–2 చెవ్వూరి రవి అన్నారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెయింట్ అన్స్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు (సీడ్) అనే కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, మానవతా విలువలు కలిగి ఉండాలన్నారు. ఒత్తిడి లేకుండా చదవాలని పిలుపునిచ్చారు. స్పందన ఈద ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడుతూ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సామ్యూల్ రెడ్డి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థి చదువుపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లడుతూ ప్రతి విద్యార్థి నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం నిర్మల కుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఉత్తమ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ కాకినాడ జిల్లా కార్యదర్శి కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను తయారు చేయడం సంస్థ లక్ష్యమన్నారు. సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత సాయి రామకృష్ణ

భూసేకరణ వేగవంతం చేయండి

ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం వాకలపూడి నుంచి రాజానగరం వరకు విస్తరించనున్న ఏడీబీ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణ ఆయా మండల తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో కాకినాడ రూరల్, సామర్లకోట తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడీబీ రోడ్డు విస్తరణకు సంబంధించి కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం, రమణయ్యపేట, సామర్లకోట మండలం భీమవరం, జగ్గమ్మగారి పేట, పనసపాడు, వల్లూరు గ్రామాల్లో భూ సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. భూ సేకరణకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన క్లెయిములపై త్వరితగతిన విచారణ చేసి ప్రతిపాదనలు సమర్పించాలని ఏడీబీ రోడ్డు విస్తరణకు సుమారు 81 ఎకరాల మేర అవసరమన్నారు. ఈ సమావేశంలో కాకినాడ రూరల్ తహసీల్దార్ వి.మురార్జీ, సామర్లకోట తహసీల్దార్ ఎస్ఎల్ఎస్ కుమారి, పరిపాలనాధికారి వరహాలయ్య, రెవెన్యూ సిబ్బంది గంపల నాగేశ్వరరావు, గోవిందు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



భూసేకరణపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ